

# నామినేషన్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

- నామినేషన్ల స్వీకరణకు నేడు ఆఖరు
- కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాచలం, నవంబర్ 9 : నామినేషన్ల స్వీకరణకు ఒక్కరోజు మాత్రమే గడువు ఉందని, నామినేషన్ వేసేందుకు వచ్చేవారికి ఇబ్బంది లేకుండా కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. గురువారం భద్రాచలం రిటర్నింగ్ అధికారి కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూములు, అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణకు 10వ తేదీ ఆఖరు కావడంతో రద్దీ ఉండే అవకాశం ఉందని, వచ్చేవారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికసంఖ్యలో నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు వస్తే, క్రమపద్ధతిలో నామినేషన్లు స్వీకరించేందుకు ముందస్తుగా అభ్యర్థులకు టోకెన్లు జారీ చేయాలని ఆర్వోకు సూచించారు. ఆర్వో కార్యాలయంలో నామినేషన్లు నమోదు రిజిస్టర్‌ను ఆమె పరిశీలించారు. స్ట్రాంగ్‌రూముకు వేసిన తాళం, సీలును పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమును పరిశీలించిన ఆమె డిస్ట్రిబ్యూషన్‌లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని చెప్పారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పటిష్ట నిఘా ఉండాలన్నారు. అనంతరం జిల్లా సరిహద్దులో ఏర్పాటుచేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. జిల్లాలోకి వస్తున్న ప్రతి వాహనాన్ని నిశితంగా పరిశీలించాలని చెప్పారు. పట్టుకున్న నగదు, మద్యం తదితర వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. 24 గంటలు పటిష్ట పర్యవేక్షణ, నిఘా కొనసాగించాలని కోరారు. నామినేషన్ల స్వీకరణ గడువు ముగియనుండడంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే నగదు, మద్యం, బహుమతులు, ఆభరణాలు వంటి వాటిని మన జిల్లాకు కాకుండా పటిష్ట తనిఖీలు చేపట్టాలని చెప్పారు. పట్టుకున్న నగదు, మద్యం తదితర వాటి వివరాలను ఎప్పటికప్పుడు ఎన్నికల పోర్టల్‌లో నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భద్రయ్య, తహసీల్దార్ శ్రీనివాసరావు, డీటీ రమేశ్ పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

## జిల్లాకు చేరుకున్న ఎన్నికల పరిశీలకులు



జిల్లాకు వచ్చిన ఎన్నికల పరిశీలకులకు మొక్కలను అందజేసి ఆహ్వానిస్తున్న కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : శాసనసభ ఎన్నికల సందర్భంగా కొత్తగూడెం నియోజకవర్గానికి కేటాయించిన ఎన్నికల పరిశీలకులు గురువారం రాత్రి కొత్తగూడెంలోని ఇల్లెందు గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. కొత్తగూడెంకు నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి కమల్‌కిషోర్, శాంతిభద్రతల పర్యవేక్షణకు జిల్లాకు విచ్చేసిన సీనియర్ ఐపీఎస్, డీఐజీ క్యాడర్ అధికారి స్వపన్ సర్కార్‌కు కలెక్టర్ ప్రియాంక ఆల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లు కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో శిరీష, డీఎస్పీ రెహమాన్, లైజన్ అధికారి జినుగు మరియన్న, తహసీల్దార్లు పుల్లయ్య, కృష్ణప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

# 20 తర్వాత కేటీఆర్, హరీశ్‌రావు రోడ్ షో

భద్రాచలం, నవంబర్ 9 : భద్రాచలం నియోజకవర్గంలో ఈ నెల 20 తర్వాత బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావు రోడ్ షో ఉంటుందని ఎమ్మెల్సీ, భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తాతా మధుసూదన్ అన్నారు. గురువారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న బూర్గంపాడులో ముఖ్యమంత్రి కేసీఆర్ సభ ఉంటుందని, 24న ములుగులో ఉంటుందన్నారు. త్వరలోనే కేటీఆర్, హరీష్‌రావుల పర్యటన వివరాలను తెలియజేస్తామని పేర్కొన్నారు. అనంతరం పార్టీ భద్రాచలం జాయింట్ సెక్రటరీ బొంబోతుల రాజీవ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

# బీఆర్‌ఎస్ పథకాలకు ఆకర్షితులై చేరికలు

దుమ్ముగూడెం, నవంబర్ 9 : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఆయా గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు ఆ పార్టీలో చేరాయి. గురువారం భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు సమక్షంలో దుమ్ముగూడెం నుంచి పలువురు యువకులు పార్టీలో చేరగా మరికొన్ని గ్రామాల నుంచి పలు కుటుంబాలు చేరాయి. వీరందరికీ తెల్లం వెంకట్రావు గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఎంతో ముందుకు తీసుకువెళ్లారని, ఏజెన్సీ ప్రాంతాలు కేసీఆర్ పాలనలో ఎంతో అభివృద్ధి చెందాయని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పథకాలను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి కణితి రాముడు, ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, సర్పంచ్ సోడి జ్యోతి, నూపా సుమిత్రతోపాటు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




పార్టీలో చేరిన వారితో బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు

# ఉన్నతంగా ఆలోచించి లక్ష్యాలను సాధించాలి

- జడ్జి వసంత్‌పాటిల్

పాల్వంచ రూరల్, నవంబర్ 9 : విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించి లక్ష్యాలను సాధించాలని, వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ వహించాలని జిల్లా జడ్జి వసంత్‌పాటిల్ అన్నారు. మండలంలోని సోములగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ కిన్నెర ఆధ్వర్యంలో న్యాయచైతన్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువు, జీవితం విలువలు తెలుసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. నేరపూరిత ఆలోచనలకు చెక్ పెట్టి ఉన్నత ఆలోచనలపై దృష్టి సారించాలని, సమాజంలో ఉన్న కొందరు అట్టడుగుస్థాయి నుంచి శ్రమించి ఉన్నతస్థాయికి ఎదిగిన సంఘటనలు తెలుసుకుని వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ర్యాగింగ్ ఉచ్చులో పడొద్దని, ర్యాగింగ్‌కి పాల్పడితే కఠినచర్యలు ఉంటాయని, జీవితమే నాశనమవుతుందన్నారు. ఇంగ్లిషు భాషపై పట్టు పెంచుకోవాలని, నిత్యం వార్తాపత్రికలు చదవాలని సూచించారు. సెల్‌ఫోన్ ఊబిలో పడొద్దని, సమస్యలు ఎదురైతే ధైర్యంగా న్యాయ సాయం పొందాలని సీనియర్ సివిల్ జడ్జి భానుమతి బాలికలకు వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ శివప్రసాద్, ఇతర ప్రముఖులు రాయల కేదారేశ్వరరావు, రేపాక ప్రసాదరావు, రంజాన్, ఆరుద్ర సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, గోపాలకృష్ణ, అంజనాదేవి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జడ్జి వసంత్‌పాటిల్

# ఎమ్మెల్యే వనమాకు హెల్త్ డైరెక్టర్ గడల మద్దతు

పాల్వంచ, నవంబర్ 9 : కొత్తగూడెం బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు హెల్త్ డైరెక్టర్, జీఎస్‌ఆర్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ గడల శ్రీనివాసరావు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. గురువారం పాత పాల్వంచలోని వనమా నివాసానికి ట్రస్టు ఆర్గనైజర్స్ మోదుగు జోగారావు, అంజి నాయుడు వెళ్లి మద్దతు తెలిపారు. వనమాకు శాలువా కప్పి సత్కరించారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జీఎస్‌ఆర్ ట్రస్టు సభ్యులు

# అన్నదాన పథకానికి వితరణ



రశీదు స్వీకరిస్తున్న రామారావు, కుటుంబ సభ్యులు

భద్రాచలం, నవంబర్ 9 : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత అన్నదాన పథకానికి హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన కాకులపాటి రామారావు రూ.లక్ష వితరణ చేశారు. గురువారం వారు ఆలయానికి వచ్చి రామయ్యను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉపాలయాలను సందర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం అధికారి లింగాల సాయిబాబాకు రూ.లక్ష అందజేసి రశీదు స్వీకరించారు.

# ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

భద్రాచలం, నవంబర్ 9 : పద్దెనిమిదేండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని నోడల్ ఆఫీసర్ పీ సమ్మయ్య అన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన స్వీప్ ఓటరు చైతన్యం కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక త్రివేణి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటుహక్కు వినయోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, ఓటును అమ్ముకోవద్దని సూచించారు. ఓటుతోనే సరైన నాయకుడిని ఎన్నుకోగలమని, ఓటరు సమాజ హితం కోరాలని పేర్కొన్నారు. ఈ నెల 30న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో త్రివేణి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీ వెంకన్నబాబు, అధ్యాపకులు బీ అనిల్, ఆర్డీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ వీర్రాజు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీటీ సమ్మయ్య

# సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 9 : ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమైందని మండల బీఆర్‌ఎస్ నాయకుడు గూడవర్తి నర్సింహమూర్తి అన్నారు. వెంకటాపురం మండలంలోని బెస్తగుడెం, పలు గ్రామాల్లో బుధవారం రాత్రి పార్టీ చిడెం రవికుమార్, వేల్పూరి లక్ష్మీనారాయణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భద్రాచలం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి పిల్లారశెట్టి మురళి, పెనుమచ్చ మాధురి, చింతల శ్రీను పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న నాయకులు